క్లుప్తంగా...

సామాజిక న్యాయం కోసం 15 నుంచి 'జాతర'

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సామాజిక న్యాయం కోసం ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు పూలే, అంబేడ్కర్ జాతరను నిర్వహించనున్నట్లు పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సామాజిక సంఘాలైన కేవీపీఎస్, గిరిజన సంఘం, కల్లుగీత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.వి.రమణ, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్ తదితరులు మాట్లాడుతూ... భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవటంతోపాటు మనువాదాన్ని మట్టుపెట్టాలన్నారు. పూలే, అంబేడ్కర్‌ల స్ఫూర్తితో హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, అవాజ్ ప్రధాన కార్యదర్శి ఎం.డి.అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమీక్ష



సమీక్ష సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం అర్హులైన నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం శివం రోడ్డు అడ్వాన్స్ట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో వచ్చే నెలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సుమారు 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా జాబ్‌మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్‌లు బి.పద్మ వెంకట్‌రెడ్డి, అమృత, అడ్వాన్స్ట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ అధికారులు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

భారీ వర్షానికి నేలకూలిన చెట్టు



కాచిగూడ: నగరంలో గురువారం కురిసిన భారీ వర్షానికి గోల్నాక డివిజన్ నెహ్రూనగర్‌లో చెట్టు నెల కూలింది. స్థానిక బీఆర్‌ఎస్ నేత మహ్మద్ యూసుఫ్ సమస్యను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే చెట్టును తొలగించాలని జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ అధికారులను ఆదేశించారు. సిబ్బంది వచ్చి చెట్టును తొలగించారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురు బాలుర అరెస్టు

కాచిగూడ: గంజాయి సేవిస్తున్న ముగ్గురు మైనర్ బాలురను కాచిగూడ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు సమాచారం మేరకు... ముగ్గురు బాలురు గురువారం కాచిగూడ రైల్వే స్టేషన్ వెనుక వైపు గంజాయిని సేవిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బాలురను అదుపులోని తీసుకుని జువైనల్ కోర్టుకు బాలురను తరలించారు.

ఆసక్తికరంగా 'రాగావధానం'



దుర్గను సత్కరిస్తున్న పీవీ ప్రభాకర్‌రావు

చిక్కడపల్లి: ఆస్కార్ అవార్డు సాధించిన నాటు నాటు పాటను శాస్త్రీయ సంగీతంలో మధురంగా పాడిన దుర్గ ఖామస్ రాగంలో ప్రముఖ నటి, గాయని భానుమతి పాట ఎందుకే నీకింత తొందర అని గానం చేసి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. గురువారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విన్నకోట దుర్గ రాగావధానం ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది. పీవీ గ్లోబెల్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ ప్రభాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని దుర్గను సత్కరించారు. శ్రీ చిమ్మపూడి రామమూర్తి బహుగళ విపంచి బిరుదును దుర్గకు ప్రకటించడం అభినందనీయం అని కొనియాడారు. చిమ్మపూడి అప్పాజీ, సహ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి



రామాలయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జయసింహ



అభయాంజనేయ స్వామి ఆలయంలో గవర్నర్ బండారు దత్తాత్రేయ

కనులపండువగా శోభాయాత్ర

- రాంనగర్ నుంచి హరినగర్ వరకు భారీ యాత్ర
- నారాయణగూడ చౌరస్తా నుంచి సీజీఓ టవర్స్ వరకు మరో యాత్ర

ముషీరాబాద్: హనుమత్ జయంతి సందర్భంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. ప్రధాన శోభాయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు నారాయణగూడ చౌరస్తా నుంచి ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోకి ప్రవేశించింది. చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్, గాంధీనగర్, కవాడిగూడ సీజీవో టవర్స్ మీదుగా బైబిల్ హౌస్‌కు చేరుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. యాత్రలో వేలాది మంది యువకులు జై శ్రీరామ్ నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాంనగర్‌లో...

రాంనగర్ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి హనుమాన్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర జరిగింది. యువకులు వందల సంఖ్యలో కాషాయ జెండాలు చేతబూని జై శ్రీరామ్ నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవ సమితి కమిటీ సభ్యులు గడ్డం రవి, కె.రవిచారి, మద్దూరి శివాజీ, ఉదయ్‌కుమార్, నవీన్ గౌడ్ తదితరులు యాత్రకు నేతృత్వం వహించారు.

శోభాయాత్రకు ఘన స్వాగతం

చిక్కడపల్లి: హనుమాన్ శోభాయాత్రకు ఆర్టీసీ క్రాస్ రోడ్డులో గాంధీనగర్, రామ్‌నగర్ కార్పొరేటర్‌లు ఎ.పావని వినయ్‌కుమార్, రవిచారిలు ఘన స్వాగతం పలికారు. బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరామ్‌ను స్వాగతవేదికపైకి తీసుకెళ్లి సన్మానించారు. నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ ప్రస్తుత అధ్యక్షుడు శివాజీ, గాంధీనగర్ బీజేవైఎం అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



చిక్కడపల్లిలో శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



అడిక్‌మెట్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయంలో నల్లకుంట ఇన్‌స్పెక్టర్ రవి, చైర్మన్ అంజయ్య



అభయాంజనేయ స్వామి ఆలయంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌గౌడ్



ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో బందోబస్తు విధుల్లో పోలీసు అధికారులు



చిక్కడపల్లిలో శివాజీ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్...



ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో సాగుతున్న హనుమాన్ శోభాయాత్ర

తెలంగాణలో బీజేపీకి అధికారం తథ్యం

బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు



అంబర్‌పేటలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న గౌతమ్‌రావు

అంబర్‌పేట: పల్లె పల్లెకూ బీజేపీ ఓబీసీ విభాగం పార్టీ జెండా.. అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్తుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని గౌతంరావు ధీమా వ్యక్తం చేశారు. ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్ యాదవ్, నాయకులు వెంకటేష్ గౌడ్, నాగభూషణం చారి, ఆనంద్ గౌడ్, నర్సింగ్ రావు, కృష్ణ గౌడ్, అచ్చిని రమేష్, శ్రీధర్, డి.వెంకటేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో...

నల్లకుంట: నల్లకుంటలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు పార్టీ జండాను ఆవిష్కరించారు. కార్పొరేటర్ అమృత, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేశ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



కాచిగూడలో .. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడలో...

కాచిగూడ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాచిగూడ, లింగంపల్లి చౌరస్తాలలో ఆ పార్టీ జెండాలను కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఎగురవేశారు. కాచిగూడ, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డ, కుద్బిగూడ తదితర ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, బండారు సంతోష్ కుమార్, సుభాష్ పటేల్, శీర్‌సాగర్, అరవింద్, హజారిబాబు, అనిల్ అరోరా, బి.భీమ్‌రాజ్, వాసు, బల్వీర్, సునిల్, తిలక్ సక్సేన, ఎస్ఎస్ రాము, బాలప్రసాద్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్, సూరి, ఆనంద్, రాజ్ కుమార్, ప్రతిభ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

కోల్ మైన్స్ స్కీంను సవరించి రూ. 15 వేల పింఛన్ చెల్లించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కోల్ మైన్స్ పింఛన్ స్కీం 1998ను సవరించి కనీస పింఛన్ రూ. 15 వేలు చెల్లించాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి.రామచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి బూపల్లి భానయ్య డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంట్రిబ్యూటరీ పోస్టు రిటైర్మెంట్ స్కీం కార్డుల వైద్య ఖర్చుల పరిమితి రూ. 8 లక్షలు కాకుండా అపరిమితంగా చెల్లించాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు కంపెనీ గెస్టహౌస్‌లో వసతి కల్పించాలని, సీపీఆర్ ఎంఎస్ కార్డు ద్వారా వైద్యం పొందిన వారికి రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులో జాప్యం చేయవద్దని, వివిధ ఏరియాల్లో ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను విశ్రాంత ఉద్యోగులకు ఇవ్వాలని కోరారు. ప్రస్తుత ఉద్యోగులకు చెల్లిస్తున్నట్లు లాభాల వాటాలో కొంత శాతం విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షులు ఎ.వేణుమాధవ్, కోశాధికారి ఎం.విజయ్ బాబు, సలహాదారులు టి.ఉమాకర్, ఎస్.నర్సింగరావు, మెరుగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు రామచందర్‌రావు

మే 15లోపు నాలా పనులను పూర్తి చేయాలి

ముషీరాబాద్, అంబర్‌పేట ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నల్లకుంట కూరగాయ మార్కెట్‌లోని హెరిటేజ్ నుంచి శ్రీరాంనగర్ బస్తీ వరకు చేపట్టిన నాలా పనులు ఏడాదిగా కొనసాగుతున్నాయని, మే 15వ తేదీలోపు ఆయా పనులు పూర్తి అయ్యేలా కృషి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌లు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సంబంధిత అధికారులతో కలిసి మూన్ కేఫ్ వద్ద ఆగిపోయిన నాలా పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ... నాలా పనులు జరుగుతున్నప్పుడు భద్రత చర్యలు తీసుకోవటంతో పాటు పనులు పూర్తి అయిన దగ్గర వెంటనే రోడ్డు వేయాలని, దుమ్ము లేవకుండా రోడ్లపై నీళ్లు చల్లించాలని సూచించారు. నాలా పనులు, రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్ఈ కిషన్‌రావు, ఈఈ శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాంట్రాక్టర్ తిలక్, పద్మకాలనీ అసోసియేషన్ కన్వీనర్ రితీష్, కాలనీ నాయకులు వీరయ్య, మోహన్ నాయుడు, రమేష్, బాలకృష్ణారెడ్డి, మోహన్‌రావు, డాక్టర్ జయసూర్య తదితరులు పాల్గొన్నారు.



మూన్ కేఫ్ వద్ద నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్

ఆటో డ్రైవర్ అదృశ్యం

కాచిగూడ: ఆటో డ్రైవర్ అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు సమాచారం మేరకు... నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ సుదీర్ కుమార్(33) ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆటోను అమ్మేశాడు. నెల రోజులుగా పనిలేక ఖాళీగా ఉంటున్నాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య పూజ గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబర్‌పేట ఆలయ సేవా సమితి సభ్యుల ప్రమాణ స్వీకారం

అంబర్‌పేట: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో విజయం సాధించిన త్రిశూలం ప్యానెల్ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్నారు. గురువారం అంబర్‌పేట మహంకాళీ ఆలయంలో కార్యక్రమం సందడిగా సాగింది. అధ్యక్షుడిగా వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా బింది మల్లికార్జున్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా చెంగలి సుధాకర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా దోమకొండ కిషోర్, కోశాధికారిగా గడ్డం శ్రీధర్ బాధ్యతలు తీసుకున్నారు. మాజీ కార్పొరేటర్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, నాయకులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, పి.గిరిధర్‌గౌడ్, బింది రాజ్‌గౌడ్, సతీస్‌గౌడ్, దడిగె జగన్, గోపాల్‌గౌడ్, మహేందర్‌గౌడ్, పండిత్ ముదిరాజ్ పాల్గొన్నారు.



బాధ్యతలు తీసుకుంటున్న కమిటీ ప్రతినిధులు

సుందరయ్య పార్కులో అక్రమ పార్కింగ్‌లను అరికట్టాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రతిష్టాత్మకమైన సుందరయ్య పార్కులో వాహనాల అక్రమ పార్కింగ్‌లపై జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు. రోజూ పార్కులో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రైవేట్ భారీ వాహనాలను పార్కింగ్ చేయటం వల్ల వాకర్స్ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పార్కులో పని చేసే సూపర్‌వైజర్‌తో పాటు ఇతర సిబ్బంది ప్రైవేట్ వాహనదారుల నుంచి డబ్బులు తీసుకొని పార్కింగ్‌కు అనుమతిని ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. పార్కులోని సిబ్బంది కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు మీటింగ్‌లు పెట్టుకోవటానికి అనుమతిస్తూ ఇటీవల పార్కులో వేసిన గడ్డిని ధ్వంసం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలై వెంటనే చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.



సుందరయ్య పార్కులో అక్రమంగా పార్కింగ్ చేసిన భారీ వాహనాలు

పక్కదారిపడుతున్న అవార్డులు!

- దళారులపై చర్యలు తీసుకోవాలి
- టీఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్ మాదిగ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దళిత సేవా రత్న అవార్డులను అమ్ముకుంటున్న దళారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి (టీఎంపీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో టీఎంపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేష్ మాదిగ మాట్లాడుతూ... దళిత సమాజం కోసం నిరంతరం కృషి చేసేవారికి, జాతికోసం సర్వస్వాన్ని వదులుకున్న వారికి, దళితుల్లో చైతన్యం తీసుకువచ్చే వారికి ఇచ్చే దళితరత్న అవార్డులను దళిత సమాజం అంటే ఏమిటో తెలియని వారికి ఇస్తున్నారని విమర్శించారు. కొంత మంది బ్రోకర్లు దళిత సంఘాల ముసుగులో చందాలు వసూలు చేసే నాయకులు అవార్డుల పేరుతో దందాలు చేస్తూ అవార్డులను అమ్ముకుంటున్నారని విమర్శించారు. దళిత సేవా అవార్డులు అంగట్లో సరుకుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవార్డుల పేరుతో లక్షలాది రూపాయలు సంపాదిస్తున్న వారిపైన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. మహనీయుల ఉత్సవ కమిటీని రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. దళిత సమాజాన్ని తాకట్టుపెట్టే వారికి ఉత్సవ చైర్మన్‌లు ఇస్తే మహనీయులను అవమానించేనట్లేనని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీడియా అధ్యక్షుడు మదిరి నర్సింగరావు, అధికార ప్రతినిధి ఇంజమ్ శాంబయ్య, గ్రేటర్ అధ్యక్షుడు కె.నర్సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గారె వెంకటేష్ మాదిగ



చిక్కడపల్లిలో బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భరత్ తదితరులు



వివేకనగర్ ఆలయంలో గదతో ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఉత్సవాల్లో పాల్గొన్న నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్

వైభవంగా హనుమాన్ జయంతి

- సింధూర శోభితం.. రామబంటుకు భక్తనీరాజనం
- ఘనంగా హనుమాన్ జయంతి

అంబర్‌పేట: హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంబర్‌పేట, చిక్కడపల్లి నియోజకవర్గాల్లో గురువారం ఆంజనేయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయాలు కళకళాడాయి. ఆయా ప్రాంతాల్లో హనుమాన్ ర్యాలీలను అట్టహాసంగా నిర్వహించారు.

న్యూ నల్లకుంటలో...

నల్లకుంట: న్యూ నల్లకుంట బాయమ్మ లేన్‌లోని శ్రీ వీరాంజనేయ గణపతి ఆలయం, బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో హనుమంతుడికి ప్రత్యేక అభిషేకాలు, తులసి మాల, ఆకు పూజలు, వడ మాల పూజలు, అర్చనలు చేశారు.

కాచిగూడ, గోల్నాక డివిజన్లలో...

కాచిగూడ: శ్రీరామబంటు ఆంజనేయ స్వామికి భక్తులు నీరాజనాలు అర్పించారు. హనుమద్ జయంతి సందర్భంగా కాచిగూడ, గోల్నాక డివిజన్లలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, ఎంసీహెచ్ మాజీ ఫ్లోర్ లీడర్ ఎస్.గోపాల్‌రావు, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తదితరులు ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. హరాస్‌పెంటలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు పూజలు చేశారు.

చిక్కడపల్లిలో...

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ దంపతులు, యువజన విభాగం నాయకుడు ముఠాజై సింహా తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ గుండెపూడి మురళీప్రసాద్, ఈవో మాచర్ల దేవనాథంలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గాంధీనగర్‌లో...

గాంధీనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో చంద్రశేఖర్ యాదవ్ ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆవిష్కరించారు. యువజన నాయకులు ముఠా జయసింహా, డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేశ్ తదితరులు పాల్గొన్నారు. సంఘ సేవకులు జానకి సుధాకర్ ఏర్పాటు చేసిన హనుమాన్ జయంతి వేడుకల్లో నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుర్రం శంకర్, కృష్ణయాదవ్, నవీన్‌కుమార్, నరేంద్ర, శీలంసత్యనారాయణలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



నింబోలిఅడ్డాలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్



గోల్నాకలో బీజేపీ గద్వాల జిల్లా ఇంచార్జి వెంకట్‌రెడ్డి తదితరులు



పూజలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు